# తిరగబడ్డ పిల్లి

'ఉదయభాను వైఫ్ వస్తోందోయ్ ఎల్లుండి స్వీడన్‌నుంచి!' అన్నారాయన నాతో.

'అవునా! మీకెలా తెలుసు?' అడిగాను.

'నిరంజన్ చెప్పాడు. విమల తమ్ముడు విష్ణు చెప్పాట్ట నిరంజన్‌కి!'

'ఎలాగైనా నేను విమలను కలవాలి!' అన్నాను.

'ఎల్లుండి ఢిల్లీనుంచి బయలుదేరి హైదరాబాదు వస్తోంది. విష్ణు వాళ్ళింట్లో వారం రోజులుండి, వాళ్ళమ్మ గారింటికి వెళ్తుందట గుంటూరు!' అన్నారాయన.

హమ్మయ్య!' అనుకున్నా.

అప్పుడే మా ఇంటికొచ్చిన మా మరదలు మా సంభాషణంతా విని, నా ముఖ కవళికలను కూడా గమనించి, 'విమల ఎవరండీ!' అని అడిగింది.

'అదొక పెద్ద కథలే, చెప్పమంటావా?' అడిగాను.

ఆమెలో క్యూరియాసిటీ పెరిగింది. 'చెప్పండి!' అంది.

చెప్పడం మొదలు పెట్టాను.

* * *

దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం మా పెళ్ళయిన కొత్తరోజులవి... పెద్దగా బాధ్యతలు లేకపోవడం వల్ల ఇద్దరం ఆఫీసులనుంచి రాగానే ఏ ఫ్రెండింటికో వెళ్ళడం, లేదా చంద్రన్ ఫ్రెండ్సు వాళ్ళు ఏదో ప్రోగ్రామ్ పెట్టేవారు. ఎవరింట్లోనో ఒకరింట్లో గానా బజానా! నేనూ పాడేదాన్ని. మాలో కొందరు గజల్స్ అవీ చాలా బాగా పాడేవాళ్ళు. చంద్రన్ పాడకపోయినా మంచి శ్రోత. అందరినీ ఉత్సాహపరుస్తూ, జోకులేస్తూ నవ్విస్తూ ఉండేవారు. వాళ్ళలో ఉదయభాను కూడా ఒకడు. నేను పాడే లలిత గీతాలంటే ఎక్కువ మక్కువ చూపించేవాడు. ఎంకిపాటల గురించి ముచ్చటించేవాడు. జానపద సంగీతాన్ని గురించి, బాలమురళి పాటలవరకు, భానుమతీ రామకృష్ణ మొదలుకుని ఎం.ఎస్.సుబ్బలక్ష్మి వరకు చర్చ మొదలుపెట్టేవాడు. ముఖ్యంగా నాతో చాలా చనువుగా మాట్లాడేవాడు- 'సింధూరీ! అని ఏకవచనంలో పిలుస్తూ.

ఒకరోజు అతను నన్నూ, చంద్రన్‌ని వాళ్ళింటికి భోజనానికి పిలిచాడు. అప్పటికే అతనికి ఇద్దరు పిల్లలు - ఒక ఆడపిల్ల, ఒక మగపిల్లాడు. మళ్ళీ ఆమె నీళ్ళోసుకుంది. మేము వెళ్ళేసరికి ఉదయభాను ఇంకా ఇంటికి రాలేదు. చెప్పడం మరిచా - అతను డాక్టరు. ఎం.బి.బి.యస్. బై ప్రొఫెషన్. ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదనీ, తన స్వభావానికి విరుద్ధమనీ ఏ ఆసుపత్రిలోనూ పనిచెయ్యకుండా స్వంతంగా డిస్పెన్సరీ పెట్టుకున్నాడు. అయినా అతనికి పిచ్చికోపం. పేషంట్లు వేసే ప్రశ్నలకి ఓపికగా సమాధానం చెప్పే పేషెన్స్ లేకపోవడం... కారణమేదో కానీ, అతని దగ్గరికెళ్ళడమంటే భయపడేవారు జనం. జనం ఉన్నా, లేకపోయినా పంక్చువల్‌గా సాయంత్రం అయిదయ్యేసరికి క్లినిక్ తెరిచేవాడు. రాత్రి ఎనిమిది దాకా కూర్చునేవాడు. అలాగే ఉదయం తొమ్మిది నుంచి ఇంటిగంటదాకా కూర్చునేవాడు.

మేము భోజనానికి వెళ్ళేసరికి ఏడున్నర అయింది. కాస్త ముందుగా వెళ్తే అతని భార్యతో మాట్లాడుతూ ఉండచ్చుకదా అనుకుని ముందే వెళ్ళాం. ఆ దృశ్యం చూసేసరికి నాగుండె బద్దలయిపోయింది. పిల్లలిద్దరికీ దగ్గు, జలుబూ. మందు తాగడానికి మారాం చేస్తుంటే ఓపిక లేక ఇద్దరికీ వీపుమీద నాలుగు తగిలించడంతో పంచమశ్రుతిలో ఇద్దరూ రాగాలు తీశారు. కత్తిపీట ముందేసుకుని సగం తరిగిన వంకాయలూ, పొంగిపోతున్న పప్పూ రెంటితోనూ యుద్ధం చేస్తోంది విమల.

ఆ వంటిల్లూ, పిల్లల ఏడుపులూ, తన వేషం చూసి చక్కగా ముస్తాబై వెళ్ళిన మమ్మల్ని చూసి సిగ్గూ, బాధా అన్నీ కలిసికట్టుగా తల వంచుకొని - 'వారింకా రాలేదు. మీరు కూర్చోండి. క్షణంలో వచ్చేస్తాను!' అంది.

ఆ క్షణంలో ఆమె మాటలు నా మనసుని కరిగించేశాయి. అంత ఇబ్బంది పెట్టి పిల్లలకి ఒంట్లో బాగోలేనప్పుడు, మార్నింగ్ సిక్‌నెస్‌తో అవస్థపడుతున్నప్పుడు మమ్మల్ని భోజనానికి పిలిచిన ఉదయభానుమీద ఒళ్ళు మండిపోయింది.

కాయలు కాయలుగా తరుగుతున్న వంకాయల్ని చూసి, 'గుత్తొంకాయ చేస్తున్నారా?' అన్నాను.

'అవును!' అంది విమల కాయల్ని కోస్తూనే.

'ఎందుకులెండి ఇప్పుడు? ఆలస్యమవుతుంది. ముక్కలు కోసి పోపులో వేసెయ్యండి!' అన్నాను.

'బాబోయ్! ఇంకేమన్నా ఉందా! ఆయన చెప్పి వెళ్ళారు ఏమేం చేయాలో... గుత్తొంకాయ కూర, సాంబారు, కొబ్బరి చట్నీ, పాయసం, వడలు...' అందామె దంపి పెట్టుకున్న మసాలాని వంకాయల్లో నింపుతూ మెల్లగా.

'ఇటివ్వండి నేను నింపుతాను!' అని అందుకోబోతే, ఆమె భయంగా నా వైపు చూస్తూ 'వద్దండీ! అతనొస్తే చంపేస్తారు!' అంది అప్రయత్నంగా.

అయినా నేను వినకుండా ఆమె చేతిలోంచి వంకాయల్ని తీసుకొని నింపడం మొదలెట్టాను. నా చొరవ చూశాక ఆమెకి కాస్త ధైర్యం వచ్చిందేమో, కాస్త మాట్లాడటం మొదలుపెట్టింది.

'ఇప్పుడివన్నీ చేయకపోతేనేం, పాయసం, వడలు మానెయ్యండి!' అన్నాను.

అప్పటికే ఆమె నాలోని స్నేహభావాన్ని గమనించినట్టుంది, మెల్లగా చెప్పింది- 'ఆయన గురించి మీకు తెలీదేమో! చెప్పింది చెయ్యకపోతే వీపు బద్దలవుతుంది!' అంది.

ముందు తమాషాగా చెప్తోందేమో అనుకున్నా. అంతలోనే వాళ్ళ బాబిగాడు ఏడుస్తూ వచ్చేసరికి, పెరుగు గిన్నె కాలికి తగిలి, పెరుగంతా ఒలికిపోవడంతో విమల వణికిపోతూ, వాణ్ణి కొట్టి, ఏడవటం మొదలుపెట్టింది. వెంటనే వాణ్ణి తీసుకుని ఆడించమని చంద్రన్‌కిచ్చి ఆమెను ఓదార్చటానికి ప్రయత్నించాను.

ఆమె గజగజ వణికిపోతూ, 'మధ్యాహ్నమే తోడేశాను. పులిసిపోకుండా ఉండాలని, వెధవ ఒలకపోసేశాడు!' అంటూ పమిట కొంగు అడ్డం పెట్టుకొని ఏడుపు లంకించుకుంది.

'పోనీయండి, చిన్నవాడు, అందులోనూ ఒంట్లో బాగాలేదు. పెరుగు లేకపోతే ఏమైంది ఒక్కపూటకి, ఇన్ని ఉన్నాయి కదా!' అన్నాను.

'ఆయన చంపేస్తారండీ! అసలే కాస్త పులుపెక్కువయినా, సరిగ్గా తోడుకోకపోయినా పట్టుకెళ్ళి మోరీలో పోస్తారు. కూరలు కూడా అంతే! కాస్త ఉప్పో, కారమో ఎక్కువైతే కంచం విసిరేస్తారు నా మొహాన!' అంటూ ఏకరువు పెట్టింది.

నాకు మతిపోయింది. చిన్న చిన్న వాటికి భార్యని కొట్టి హింసించేంత కిరాతకుడా ఉదయభాను? సంగీత, సాహిత్యాల గురించి అంత చక్కగా మాట్లాడుతుంటే ఎంతో సహృదయుడనుకున్నాను. విమల కన్నీళ్ళు ఆ క్రితం రోజు కొట్టిన చెంపమీద దెబ్బలు గీతలుగా కనిపిస్తుంటే ఉదయభాను నా మనసులో ఒక పశువులా ముద్ర పడ్డాడు. నాలుగేళ్ళు, రెండేళ్ళ పిల్లలు! గర్భంలో ఒకపాప! సతమతమైపోతున్న ఆమెను ఎలా ఓదార్చాలో తెలియక కనీసం పెరుగు సమస్యనైనా తీరుద్దామని చంద్రన్‌కి చెప్పి ఎక్కడైనా మంచి పెరుగు కొనుక్కురమ్మని పంపాను.

ఉదయభాను స్నేహితుడే అయినా ఈ రెండో సైడ్ కథ తెలియని చంద్రన్ ఆశ్చర్యంగానే చెప్పిందంతా విని పెరుగుకోసం వెళ్ళాడు. ఉదయభాను వచ్చేలోగా తిరిగొచ్చేయ్యాలనీ, ఎలాగో నా చాకచక్యాన్నంతా ఉపయోగించి పిల్లల్ని ఆడించడం మొదలెట్టాను. పాపం, విమల వంటలో నిమగ్నురాలయింది.

అంతలో ఉదయభాను రానే వచ్చాడు. చంద్రన్ ఏడీ అంటే ఏదో చెప్పి, ఇప్పుడే వస్తారన్నాను. విమల దగ్గర కూర్చుని కబుర్లు చెబుతున్న నన్ను డ్రాయింగ్ రూంలోకి పిలిచాడు. తండ్రిని చూడగానే పిల్లలిద్దరూ ఏడుపు మానేసి కూర్చున్నారు. నాతో సంభాషణ మొదలుపెట్టాడు. ఎం.ఎస్, భానుమతిగార్ల సంగీతం గురించి.

'పాపం, విమల ఒక్కర్తే పనిచేస్తోంది. నేను కూడా కాస్త హెల్ప్ చేసొస్తాను!' అన్నాను.

'దానికలవాటే! నువ్వు రా!' అన్నాడు.

వచ్చినట్టు వెళ్ళాను కానీ, వంటింట్లో విమలరూపం నన్ను పిచ్చిదాన్ని చేస్తోంది. ఈలోగా మెల్లగా చంద్రన్ పెరుగుతెచ్చి అతను చూడకుండా ఎలాగో వంటింట్లో పెట్టి వచ్చాడు. విమల వంటంతా పూర్తయ్యేవరకు మేము మాట్లాడుతూనే ఉన్నాం. రాత్రి పదయింది.

ఆమె మా ముగ్గురికీ వడ్డన మొదలుపెట్టింది. "మీరూ కూర్చోండి, లేటయిపోయింది!" అన్నాను విమలతో.

ఆమె సమాధానం చెప్పేలోగా "దాని కలవాటే! ఒక్కరోజు లేటయితే ఏమీ అవదు!" అంటూ.

"ఊఁ, వడ్డించు!" అన్నాడు.

విమల కిక్కురుమనకుండా వడ్డించింది. వంట ఎంతో బాగా చేసింది. అయినా ఉదయభాను ఏదో ఒక వంక పెడుతూనే ఉన్నాడు. ఎలాగో భోజనాలు పూర్తిచేసి బయటపడ్డాం. దారంతా నా మనసు నిండా జాలిగా ఉన్న విమల రూపమే!

విమల పచ్చని శరీరచ్ఛాయతో, పెద్దజడ, గుండ్రటి కళ్ళు, కనుముక్కుతీరు ఆకర్షణీయంగానే ఉంటుంది. గుంటూరులో వాళ్ళ నాన్నగారు ఒక పొగాకు కంపెనీలో పనిచేస్తున్నారు. ఆ రోజుల్లోనే ముప్పైవేల కట్నం, బోలెడు నగలు, ఒక ఎకరం పొలం ఇచ్చి పెళ్ళి చేశారు. అయితే విమల పెద్దగా చదువుకోలేదు. ఎనిమిదో తరగతి వరకే చదువుకుంది. తల్లికి ఆరోగ్యం బాగా లేదని చదువు మానేసి ఇంట్లో ఉండిపోయింది. కట్నం చూసి, ఆమె అందాన్ని చూసి పెళ్ళి చేసుకుని, చదువు లేదని హింసించడం, పరదాలో ఉంచినట్టు ఇంట్లోనే ఉంచి ఏ స్నేహితుల దగ్గరకీ తీసుకురాకుండా ఉంచడమే కాక, పిచ్చికోపంతో కొట్టడం... వింటే ఉదయభాను అంటే నాకు అసహ్యం కలిగింది. క్రమంగా ఉదయభానుతో మాట్లాడటం తగ్గించేశాం ఆ రోజు తరువాత నేనూ, చంద్రన్.

*                *                *

బి.యస్.రాజు యూనివర్శిటీలో కెమిస్ట్రీ ప్రొఫెసర్. అతను లండన్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే పెట్రీషియా అనే స్వీడన్ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత అతనితోపాటు ఆమె కూడా ఇండియాకొచ్చేసింది. పెళ్ళయి పదేళ్ళయినా వాళ్ళకి పిల్లలు పుట్టలేదు. ఎప్పుడు చూసినా ఇద్దరూ దెబ్బలాడుకుంటూ ఉండేవారు. వారలా దెబ్బలాడుకొని విడాకులు పుచ్చుకుంటాం అని మా దగ్గరకొచ్చి చెప్పేవారు. సాధ్యమైనంతవరకు కాపురం నిలబెట్టాలనే మేము సర్దిచెప్పేవాళ్ళం. కానీ ఆ రోజు దృఢనిశ్చయంతో వాళ్ళు మా ఇంటికొచ్చి మంచి లాయరు పేరు చెప్పమని చంద్రన్‌ని అడిగారు.

సరిగ్గా అదే సమయానికి ఉదయభాను కూడా వచ్చాడు. పరిచయం చేశాం వాళ్ళకి ఉదయభానుని. అంతే! పెట్రీషియాతో ఒకటే సొద. తరువాత కాసేపటికి ముగ్గురూ వెళ్ళిపోయారు. ఆ తరువాత సంవత్సరం ఎలాగో గడిచిపోయింది. ఎవరి గొడవల్లో వాళ్ళమున్నాం. ఒకరోజు చంద్రన్ ఇంటికొచ్చి చెప్పిన వార్త నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

ఉదయభాను పెట్రీషియాకి తొందరగా విడాకులిప్పించేసి తనే పెళ్ళిచేసుకొని ఆమె వెంట స్వీడన్ వెళ్ళిపోయాడని. విమలా, పిల్లలూ కళ్ళముందు తిరిగారు. పాపం, అంత ఆస్తి... చదువుకోలేదు! అమాయకురాలు... అనుకోగానే నా కళ్ళు వర్షించాయి. ఉదయభాను ఎదురుగుండా ఉంటే చావబాదాలనిపించింది.

కాలచక్రంలో మరో నాలుగేళ్ళు గబగబా గడిచిపోయాయి. పిల్లలూ, చదువులూ... మా సమస్యలతో మేము మునిగి ఉదయభాను సంగతి మర్చిపోయాం. ఒకరోజు విమల తమ్ముడు విష్ణు కనిపించి, అక్కా, పిల్లలు స్వీడన్ వెళ్ళిపోయారని చెప్పాడు.

నాకు ఒళ్ళు మండింది ఆ మాట వినగానే. భార్యంటే ఏమాత్రం ప్రేమ, అభిమానం, గౌరవం లేని ఆ మనిషికోసం, ఆత్మాభిమానం కొంచెమైనా లేకుండా విమల ఎందుకిలా వెళ్ళింది? ఛీ! ఈ ఆడవాళ్ళంతా ఇంతే! కొట్టినా, చంపినా భర్త పాదాలకింద చావాలి! అదే పతివ్రతా లక్షణం! అందుకోసం ఎన్ని అవమానాలనైనా భరిస్తారు! తమకంటూ వ్యక్తిత్వం లేకుండా బానిసల్లా బతుకుతారు. కుక్కకూడా ఛీకొడితే మళ్ళీరాదు. గొడ్డును బాదితే తాడు తెంచుకొని పరుగుతీస్తుంది. కానీ ప్రాణాలు పోతున్నా మెడలోని పసుపుతాడుని మాత్రం తియ్యకుండా అక్కడే హీనంగా పడిచచ్చే భారతీయ స్త్రీని తలుచుకుంటే బాధ, చీదరా పుట్టుకొచ్చి అవే మాటలు విష్ణుతో అన్నాను.

'ఆంటీ! మీరు పొరబడుతున్నారు. అక్క చాలా మారిపోయింది. స్వీడన్ వెళ్ళింది బావ దగ్గర ఉండటానికి కాదు. తను స్వతంత్రంగా బతకడానికి, పిల్లలను ధైర్యంగా

బతికించుకోవటానికి. అక్కడికి వెళ్ళి అక్క బావకి విడాకులిచ్చేసింది. తను స్వీడన్ భాష నేర్చుకుని ఉద్యోగం చేస్తోంది. అక్కడ ప్రస్తుతం ఉద్యోగం దొరికేవరకు నిరుద్యోగ భత్యం ఇచ్చారు అక్కకి. పిల్లలు బాగా చదువుకుని పెరుగుతున్నారు. ఫోటోలు పంపించింది. బైదిబై... పెట్రీషియా బావకి డైవోర్స్ ఇచ్చి లండన్ వెళ్ళిపోయిందిట! పాపం. మరో కొత్త పిల్ల... మన ఇండియానుంచే వెళ్ళిందట! బావ మాయమాటల్లో పడి పెళ్ళి చేసుకుందట! కానీ ఏడాదిన్నర కాపురంలోనూ ఒక పాపని కని, బావతో సంసారం చేసినందుకేమో పిచ్చెక్కి అక్కడ ఉండలేక బావచేతిలో తన్నులు తినలేక పాపనొదిలేసి ఎలాగో ఇండియాకి చేరుకుంది. ఆమె తల్లిదండ్రులు బావమీద కేసుపెట్టారట. పాపని తేవడానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోవడంలేదు. పాపని అనాథాశ్రమంలో వేయాలని బావ ప్రయత్నిస్తూంటే అక్క ఆ పాపని తన ఇంటికి తెచ్చుకొని పెంచుతోందట. అది చూసి బావ అక్క మారిపోయిందని ఇంటికొచ్చాట్ట! అక్క చీవాట్లు పెట్టి అతణ్ణి పంపించేసిందట. పాప దిక్కులేనిదానిలా అనాథాశ్రమంలో పెరగటం ఇష్టంలేక, ఇంటికి తెచ్చానే తప్ప, పాప పేరుతో నీకు దగ్గరవ్వాలని కాదు అందట!

'బావకిప్పుడు ఉద్యోగంలేదు, నిరుద్యోగ భత్యం తప్ప. పిచ్చివాడిలా ఉన్నాట్ట. తిండికి కూడా ముఖం వాచిపోయి పాపని చూడటానికనే మిషతో ఇంటికొస్తే, అంత అన్నంపెట్టి పంపించేస్తోందట అక్క!' చెప్పడం ఆపాడు విష్ణు.

'ఆంటీ! ఆశ్చర్యంగా ఉంది కదూ! మొదట్లో నాకూ అలాగే అనిపించింది. పిల్లిలా వున్న మా అక్క ఇప్పుడు పులిలా అయింది!' అన్నాడు.

ఆ తరువాత మాటలు నా మనసుకెక్కలేదు. విమలలో అంతర్గతంగా దాగి ఉన్న వ్యక్తిత్వం మర్రిచెట్టులా ఎదిగి కొమ్మలై రెమ్మలై... ఊడలై విజృంభించినట్టనిపించింది. విమలలోని మాతృత్వం తన బిడ్డలతో పాటు ఆ పాపనీ పెంచేలా చేసింది. ఆమెలోని వ్యక్తిత్వం, ఆమె స్వంత ఆలోచనలతో స్వతంత్రంగా ఎదిగేలా చేసింది. ఆమె జీవితం పదిమందికి నీడనిచ్చేదిలా స్వయం ఉపాధి కేంద్రాన్ని స్థాపించి, తెలుగుతనాన్ని, తెలుగు పౌరుషాన్ని, తెలుగు ఔన్నత్యాన్ని చాటిస్తోంది!

ముప్పై ఏళ్ళక్రితం పారిజాతపు పువ్వులా బూట్లకింద నలిగి పచ్చడైపోతున్నట్టు కనిపించిన విమల, ఈ రోజున స్వయం ప్రకాశంగల మణిలా కనిపిస్తోంది. ఆ కాంతి జీవితపు అన్ని కోణాలనూ స్పృశిస్తోంది.

* * *